# చెరువులు నిండె.. రైతన్న మురిసె

- భారీ వర్షాలకు నిండిన చెరువులు, కుంటలు
- ఖరీఫ్ పంటలకు పుష్కలంగా సాగునీరు
- సాగుకు సన్నద్ధమైన అన్నదాతలు


తంగడంచ చెరువు


నిండుకుండను తలపిస్తున్న పారుమంచాల చెరువు

**జూపాడుబంగ్లా:** ప్రతిఏటా జూలై, ఆగస్టు మాసాల్లో నిండుతున్న చెరువులు ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచే కురుస్తున్న వర్షాలకు జలకళ సంతరించుకున్నాయి. నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లోని 14 చెరువులు, మూడు కుంటలు నిండుకుండలను తలపిస్తుండటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ పంటల సాగుకుసన్నద్ధం అవుతున్నారు.

**జూన్ ప్రారంభంలోనే గరిష్ట నీటి మట్టాలు..**

జూన్ మాసం ప్రారంభం నుంచి కురిసిన వర్షాల వల్ల మండలంలోని పారుమంచాల, మండ్లెం, తంగడంచ చెరువులు నిండాయి. అలాగే నందికొట్కూరు మండలంలోని రెండు కుంటలు, పాములపాడు మండలంలో బానుముక్కల కుంట, కొత్తపల్లి మండలంలో 5 చెరువులు, ఆత్మకూరు మండలంలోని ఆరుచెరువుల్లో కరివేన, కురుకుంద, ఇంద్రేశ్వరం చెరువులు వర్షపు నీటితో కలకలలాడుతున్నాయి. సాధారణం కంటే అధిక వర్షపాతాలు నమోదు కావడంతో పలు చెరువులు అలుగులెక్కి పారాయి. మిడుతూరు, గడివేముల, ఓర్వకల్లు మండలాల్లో కురిసిన వర్షాల దాటికి కాకిలేరు, సుద్దవాగు, ఇసుక వాగులు పొంగిపొర్లాయి. మండ్లెం, పారుమంచాల, తంగడంచ చెరువులు గరిష్ట స్థాయి నీటితో జలకళను సంతరించుకున్నాయి. ఈ ఏడాది మృగశిరకార్తె ప్రారంభానికి ముందే చెరువులు నిండటంతో ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సమస్య లుండవని రైతులు మురిసిపోతున్నారు.

**చెరువుల కింద 6,045 ఎకరాల్లో పంటల సాగు**

నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లోని మండలాల్లోని 14 చెరువులు, మూడు కుంటల పరిధిలో 6,045 ఎకరాల్లో రైతులు రబీ పంటలు సాగు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల, మండ్లెం, తంగడంచ చెరువుల కింద 2,670 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి, పత్తి, మిరప, మినుము, కంది, మొక్కజొన్న, జొన్న తదితర పంటలను సాగు చేయనున్నారు. పారుమంచాల చెరువు కింద 1,600ఎకరాలు, తంగడంచ చెరువు కింద 220 ఎకరాలు, మండ్లెం చెరువు కింద 850ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు సరిపడా నీళ్లు చెరువుల్లో ఉండటంతో మెరుగైన దిగుబడులు సాధించుకునే అవకాశాలున్నాయని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నందికొట్కూరు, పాములపాడు మండలాల పరిధిలో మూడు నీటి కుంటలుండగా వాటి పరిధిలో 275 ఎకరాలుండగా కుంటలు పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉన్నాయి. ఆత్మకూరు మండలంలో ఆరు చెరువులుండగా మూడు చెరువుల్లో గరిష్ఠస్థాయి నీటిమట్టంతో ఉన్నాయి. వాటికింద 1,600ఎకరాలు సాగవుతుంది. కొత్తపల్లి మండలంలో 5 చెరువులుండగా వాటిలో 50శాతం మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి. వాటి కింద 1,500ఎకరాలు సాగవుతున్నట్లు మైనర్ ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

### సాగు నీటి కొరత ఉండదు



ఏటా జూలై, ఆగస్టు మాసాల్లో చెరువు నిండేది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందే కురిసిన వర్షాల వల్ల చెరువు నిండి అలుగు పారింది. ఖరీఫ్ పంటల సాగుకు నీటి కొరత ఉండదు. నాకు చెరువు కింద పది ఎకరాల పొలం ఉంది. వరి, మిరప, పత్తి, మొక్కజొన్న వంటి పంటలు సాగుచేస్తాను.

– దివాకర్‌రెడ్డి, రైతు, పారుమంచాల

### ఖరీఫ్ ప్రారంభంలోనే చెరువు నిండటం ఆనందంగా ఉంది



ఖరీఫ్ పంటల సాగుకు ముందే కురిసిన వర్షాల ధాటికి చెరువు నిండటం సంతోషంగా ఉంది. పారుమంచాల చెరువు కింద నాకు మూడు ఎకరాల పొలం ఉంది. ఈ ఏడాది మొక్కజొన్న పంటను సాగుచేయాలనుకుంటున్నాను. ఖరీఫ్ పంటల సాగుకు ముందే చెరువు నిండటం ఆనందంగా ఉంది.

– గులకరాజు, రైతు, పారుమంచాల

## ఆత్మకూరులో భారీ వర్షం


ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

**ఆత్మకూరు:** మండలం, పట్టణంలో వర్షం ఆదివారం సాయంత్రం దంచి కొట్టింది. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. పది రోజులుగా రోజూ వర్షం కురుస్తోంది. వర్షాల ధాటికి సుద్దవాగు, బవనాసి నదులు ప్రవహిస్తున్నాయి. గతేడాది చినుకు కోసం ఎంతగానో ఇబ్బందులు పడ్డ రైతన్నలు వర్షం రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల్లో నీరు వచ్చి చేరుతుండటంతో పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఇటీవల విస్తారంగా మండలంలో వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. కాగా మరో నాలుగు రోజులపాటు తుపాన్ ప్రభావం ఉండడంతో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## వార్డు సభ్యురాలి మృతి

**మహానంది:** మహానంది పంచాయతీ 11వ వార్డు సభ్యురాలు, సీపీఐ నాయకురాలు మద్దమ్మ(58) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సామేలు, ధనుంజయ ఆమె ఇంటికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నికైన మద్దమ్మ సీపీఐలో చురుగ్గా పనిచేశారని, ప్రజా సమస్యల పట్ల స్పందిస్తూ అందరిలో మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. ఆమె అకాల మరణం బాధాకరమన్నారు.

## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

**నందికొట్కూరు:** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు రాంబాబు కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షకాలం ప్రారంభంలో మల్లేరియా, డెంగీ, మెదడువాపు వ్యాధి, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షకాలంలో దోమల బెడదతో వ్యాధుల బారిన పడకుండా కాచి, వడబోసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వేడి వేడి ఆహారం తీసుకోవాలని చెప్పారు.

### నీటి సమస్య పరిష్కారానికి కృషి


వడ్డెమానులో బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

**నందికొట్కూరు రూరల్ :** గ్రామీణ ప్రాంతాలలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి మారెమ్మ దేవాలయం వద్ద ఆయన నూతన బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లు వేయించడం ద్వారా కొంత మేర నీటి సమస్యను పరిష్కరించవచ్చన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

### మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు


మహానందీశుడి ఉత్సవమూర్తులు

**మహానంది:** మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేపట్టారు. స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించగా.. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు.

### సమ్మర్ క్యాంపు ముగింపు


విద్యార్థికి సైకిల్ అందజేస్తున్న మతగురువులు

**ఆత్మకూరు:** పట్టణంలోని దర్గా మసీదులో సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకలను మత గురువులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మత గురువు ముఫ్తి అల్తాఫ్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా సైకిల్, రెండో బహుమతిగా కుట్టుమిషన్‌ను అందించారు.

### వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు


కాలువలో పూడికను తొలగిస్తున్న జేసీబీ

**నందికొట్కూరు:** వర్షపు నీరు ఎక్కడా నిలువ లేకుండా తరలించేందుకు జేసీబీతో కాలువల పూడికలు తీసేందుకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో జేసీబీలతో కాలువల్లో పూడికలు తీయించి వర్షం నీటిని తరలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందిస్తే వెంటనే తొలగిస్తామన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మారుతీనగర్, హాజీనగర్ తదితర ప్రాంతాలపై ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.

## మహానందిలో సండే సందడి


ఆలయ ప్రాంగణంలో భక్తులరద్దీ

**మహానంది:** మహానంది ఆలయంలో భక్తజన సందడి కొనసాగుతుంది. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉచిత, ఆర్జిత సేవా టికెట్లు, మహదాశీర్వచనం, అభిషేకం సేవల ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నవనంది క్షేత్రాలైన వినాయకనంది, గరుడనంది ఆలయాలను భక్తులకు సందర్శించి పూజలు చేపట్టారు.

**ఓంకారంలో భక్తుల రద్దీ**

ఓంకారం ఆలయంలో భక్తులసందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు అవడంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించారు. స్థానిక కాశిరెడ్డినాయన అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు.

## రైతులను గాలికొదిలేసిన వ్యవసాయాధికారులు


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు

**నందికొట్కూరు/మిడుతూరు:** వర్షకాలం ప్రారంభమై మృగశిర కార్తి వచ్చినా రైతులను వ్యవసాయ అధికారులు గాలికి వదిలేశారని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో, మిడుతూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ మొదలైనా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో లేరన్నారు. పంటలను సాగు చేసేందుకు సిద్ధం ఉన్నారని తెలిసిన నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల హడావిడిగా ఉంటే వ్యవసాయ అధికారులు రైతులను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందిస్తారని ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారని గుర్తు చేశారు. మొక్కజొన్న, మినుము, పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి విత్తనాలను వెంటనే రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం నాయకులు స్వామన్న, తిరుపాలు, మద్దిలేటి, శ్రీనివాసులు, ఏసేపు, చిన్న నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

## పాల ధరలు పెంచడం సమంజసం కాదు

**నందికొట్కూరు:** అధికారంలోకి వచ్చిన వెంటనే బీజేపీ ప్రభుత్వం అమూల్, మదర్ ఇండియా పాల ఉత్పత్తుల ధరలు పెంచడం సమంజసం కాదని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే కేంద్రంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు అప్పనంగా కట్టబెట్టారన్నారు. దేశ వ్యాప్తంగా 585 టోల్‌గేట్ల ధరలు అధికంగా పెంచడం జరిగిందన్నారు. టోల్‌గేట్ల ధరలు పెంచడంతో ప్రతి ప్రయాణికుడిపై రూ.5లు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ దేశమని చెబుతూ హిందువులపైనే అధిక భారం వేయడం దారుణమన్నారు. బీజేపీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా మరో స్వంతంత్ర్య పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## కేసీ కాల్వలో వర్షపు నీటి ప్రవాహం


కేసీ కాల్వలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

**జూపాడుబంగ్లా:** కేసీ కాల్వలో వర్షం నీటి ప్రవాహాన్ని చూసిన ఆయకట్టు రైతులు కాల్వకు నీటిని విడుదల చేశారా అంటూ ఆరా తీయసాగారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గార్గేయపురం చెరువు నీటితో పాటు వాగులు, వంకల్లోని నీటిని అధికారులు కేసీ కాల్వలోకి మళ్లించారు. దీంతో కేసీ కాల్వలో వర్షపు నీటి ప్రవాహం ప్రారంభం అయినట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేసీ కాల్వ ఎగువన ఉన్న తుంగభద్ర డ్యాం నిండి సుంకేసుల డ్యాంలోకి నీటి ప్రవాహం కొనసాగితేనే కర్నూలు–కడప కాల్వకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. గతేడాది ఆగస్టు మొదటి వారంలో కేసీ కాల్వకు సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తున్నందున ముందుగానే వచ్చే అవకాశాలున్నాయన్నారు.

## మోటార్ సైకిళ్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

**రుద్రవరం:** మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు తీవ్రగా గాయపడ్డారు. వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మనోజ్ రుద్రవరం మండలంలోని ఆలమూరులో ఉన్న బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆర్.నాగులవరం సమీపంలో వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై రుద్రవరం వైపు వెళ్తుండగా అదుపు తప్పి రెండు బైక్‌లు ఎదురుగా ఢీ కొన్నాయి. దీంతో మనోజ్‌కు తీవ్ర గాయాలు కాగా..వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బనగానపల్లె నుంచి కోవెలకుంట్లకు ప్రయాణికులతో వస్తున్న ఆటో అమడాల మెట్ట సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఉసేన్‌పీరా అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రునికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

### 8వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

**కొత్తపల్లి:** సంగమేశ్వరం వద్ద సోమవారం జరిగే సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8 వ వార్షికోత్సవాన్ని ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సిద్దేశ్వరం వద్ద అలుగు నిర్మాణం కోసం ప్రజాశంకుస్థాపన చేసి 8 ఏళ్లు అవుతున్న సందర్భంగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం పూర్తయ్యే వరకూ పోరాటం చేస్తామని వివరించారు. అలుగు నిర్మాణం జరిగితే రాయలసీమలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని తెలిపారు. రాయలసీమ మేలుకోకపోతే భవిష్యత్తు అంధకారంలోకి పోతుందని వివరించారు.

### ఊపందుకున్న సేద్యం పనులు


పీరుసాహెబ్ పేట సమీపంలోని పొలంలో మొక్కజొన్న నాటుతున్న కూలీలు

**మిడుతూరు:** మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్ పేట, నాగలూటి, రోళ్లపాడు, చెరుకుచెర్ల, తలముడిపి, చౌట్కూరు తదితర గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో సేద్యం పనులు ఊపందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు తమ పొలాల్లో మొక్కజొన్న, పత్తి , కొర్ర, కంది సాగుకు సిద్ధంమయ్యారు. ఆదివారం మిడుతూరు, పీరుసాహెబ్ పేట, నాగలూటి గ్రామాల్లోని రైతులు మొక్కజొన్న, పత్తి విత్తులు జోరుగా సాగాయి.

### సిద్ధేశ్వరం ఉద్యమానికి సీపీఐ మద్దతు

**నంద్యాల(న్యూటౌన్):** సిద్దేశ్వరం శాశ్వత పరిష్కారానికి అలుగు నిర్మాణం చేపట్టాలని చేస్తున్న ఉద్యమానికి సీపీఐ నంద్యాల జిల్లా విభాగం మద్దతు ఇస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫకృద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ ఉద్యమ నేపథ్యంలో అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. సోమవారం చేపడుతున్న సిద్దేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలి


పారిశుద్ధ్యం లోపించిన ప్రాంతాన్ని చూపుతున్న సీపీఎం నాయకులు

**ఆత్మకూరు:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం సీపీఎం నాయకులు పర్యటించారు. శివాలయం పేరుకుపోయిన చెత్త కుప్పను చూసి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ అసహనం వ్యక్తం చేశారు. చెత్తచెదారంతో ప్రజలు అంటువ్యాధులు, చర్మవ్యాధులు, విషజ్వరాలు బారినపడే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని కోరారు.

### పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

**దొర్నిపాడు:** మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారి దర్శనార్థం స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.

## మహానందీశ్వరుడి సన్నిధిలో ..


మహానందికి వచ్చిన తెలంగాణ ఎమ్మెల్యే విజయరావు, కుటుంబ సభ్యులు


వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న డీఆర్‌ఓ లవన్న

**మహానంది:** మహానందీశ్వరుడి సన్నిధిలో తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు విజయరామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు నెల్లూరు జిల్లా డీఆర్‌ఓ, శ్రీశైలం ఈఓగా పనిచేసిన ఎస్.లవన్న మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

## శ్రీవీరాంజనేయస్వామికి మండల పూజలు


దేదీప్యమానంగా దర్శనమిస్తున్న శ్రీవీరాంజనేయస్వామి


స్వామివారికి మండల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

**జూపాడుబంగ్లా:** మండలంలోని పారుమంచాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవీరాంజనేయస్వామికి ఆదివారం మండల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ముందుగా స్వామివారి మూలవిగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించి పుష్పార్చన, కుంకుమార్చన, 41 కలశాలతో కలశపూజ నిర్వహించి స్వామివారిని పట్టువస్త్రాలతో దేదీప్యమానంగా అలంకరించారు. అనంతరం అర్చకులు స్వామివారికి శ్రీహనుమాన్‌చాలీసా, సహస్రనామావళి పఠిస్తూ స్వామివారికి పలురకాల పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ, భక్తులు శ్రీనివాసరెడ్డి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల రుణం తీర్చుకుంటా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

**ఆత్మకూరు:** శ్రీశైలం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే గెలుపొందిన సందర్భంగా ఆదివారం పట్టణంలో కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ్‌సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన ప్రజలు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసానిచ్చారు. మెజార్టీ రాలేదనో, తక్కువ ఓట్లు పోల్ అయ్యాయని ఇతరులను దూషించాల్సిన అవసరం తనకు లేదన్నారు. ప్రతి ఒక్కరి ఆదరాభిమానంతో ముందుకు సాగుతానని చెప్పారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, మహానంది ఎంపీపీ యశస్విని, వేణుగోపాల్, శివప్రసాద్‌రెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, రవిప్రసాద్, నరసింహారెడ్డి, ఉల్లి మధు, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ ఛైర్మన్ పదవికి రాజీనామా


రాజీనామా చేస్తున్న గడ్డం కృష్ణారెడ్డి

**పాములపాడు:** మండలంలోని మద్దూరు గ్రామంలోని సహకార సొసైటీ ఛైర్మన్ పదవికి గడ్డం కృష్ణారెడ్డి ఆదివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ శాప్‌ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి రైతులకు తన వంతు సహాయ సహకారాలు అందించానన్నారు. వ్యక్తిగత కారణాల రీత్యా సొసైటీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు వివరించారు. తాను పదవీ కాలంలో ఉన్నంత కాలం సొసైటీ పరిధిలోని మద్దూరు, వాడాల గ్రామ రైతులు ఎంతగానో సహకరించారన్నారు. రైతులకు సేవచేసే భాగ్యాన్ని కల్పించిన అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర శాప్‌ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### కుందూలో తగ్గని నీటి ఉధృతి


క్రిష్టిపాడు వద్ద నిండుగా ప్రవహిస్తున్న కుందూ

**దొర్నిపాడు:** కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో వర్షపు నీటితో కుందూ నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. పది రోజులుగా నదిలో వరద ప్రవాహం తగ్గడం లేదు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరు నదికి చేరుతోంది. ఇన్నాళ్లుగా ఒట్టి పోయిన నది ప్రస్తుతం నిండుగా ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఉత్సాహంగా తిలకిస్తున్నారు.